# హృదయౌన్నత్యం

జోస్యము విద్యాసాగర్

"యశోదా !

"ఏమిటండీ !"

"యశోదా !"

"ఏమిటండీ, మీ అల్లరి? పడుకోండి బాబూ ! సమయమూ, సందర్భమూ లేకుండా ఏమిటి మీ ..."

"ఇవ్వు డేమయిందోయ్? ఈ గదిలో నీవూ, నేనే !"

"మీ కెలా చెప్పాలో అర్థం కావటంలేదు. అవతల అత్తయ్యా మామయ్యా పడుకుని ఉన్నారన్న ఇదన్నా లేదు."

"అయితే ఏమిటిట?"

"ఏమీ లేదు గానీ, నెమ్మదిగా నైనా మాట్లాడుదురూ - మీకు పుణ్యముంటుంది?"

"అవునూ, ఏమయిం దీవాళ?"

"చెప్పాలా? మీకు తెలియదూ?"

"తెలుసు ననుకో! అయినా దీనికీ, దానికీ ఏమిటీ?"

"సంబంధం లేకపోయినా కనీసం ఓ రెండు రోజులు ... రెండు రోజులు ఓపిక పట్టలేరూ?"

"రెండు రోజులు. రెండు రోజులు ... అంతే కదూ?"

"ఆఁ, అంతే ! ఆనక మీ ఇష్టం !"

"అయితే ... అయితే వాళ్లను రెండు రోజుల్లో వెళ్లిపొమ్మనా నీ ఉద్దేశం? అదేనా నీ భావం?"

"చూశారా, నా సర్వస్వం అర్పించుకుని నా వారు అయిపోయా రనుకున్న మీరు, నన్ను పూర్తిగా అర్థం చేసుకున్నా రనుకున్న మీరు, మీరే న న్నొక్క మాటలో, నే నన్న ఒక్క మాటలో ఎన్ని విపరీతార్థాలు తీశారో"

"యశోదా?"

"కాకపోతే ఏమిటండీ? రెండు రోజు లంటే రెండు రోజు లనేనా నా భావం? మీరే ఇలా లేనిపోని అర్థాలు తీస్తుంటే, ఇక వయసు మళ్లిన వారు, అత్తగారి హోదాలో ఉన్నవారు, ఆడవారు అయిన మీ అమ్మగారు ఇం కేం అనుకుంటుందో, ఏమో?"

"అది కాదు, యశోదా !"

"ఆమె ఏ మనవచ్చు? ఏ మనుకోవచ్చు? ఇంట్లో పెద్దవాళ్ల మిద్దరం ఉన్నామన్న ఇంగిత జ్ఞానం ... పోనీ, వాడికి లేకపోతే పోయింది. వాడు మగవాడు. ఇదీ? ఇది ఆడదా, గాడిదా? దాని కేమైంది? బుద్ధి గడ్డి తిందా? కనీసం తలుపు లన్నా వేసుకోకుండా మొగుడి పక్కకు చేరుతుందా' అనరూ?"

"క్షమించు, యశోదా! నే నా భావంతో అనలేదు."

"మీరు ఎన్నన్నా చెల్లుతుందండీ ! కానీ కొత్తగా వచ్చిన నేను ... నే నే చిన్న మాట అన్నా వస్తుంది గొడవ."

"పోనీ, దగ్గరకు రాకపోతే పోయె ! అందంగా అలంకరించుకోవటం కూడా మానేశా వేం? నాకు ఇలా ఉంటే బాగుండదు. పోనీ అమ్మ ఏమైనా అన్నదా?" అనుమానంగా అడిగాడు.

"ఛ ! అ దేం లేదు. ఆవిడ ఎప్పుడూ అనరు. అయినా ఎవరైనా ఏమన్నా అంటారేమో నని అనుమానం వచ్చినప్పుడు అలా చేయకుండా ఉంటే సరిపోలా?"

"పోనీ ..."

"ఇక పోనీ లేదూ, గీనీ లేదు కానీ మాట్లాడకుండా పడుకోండి."

** ** **

"యశోదా !" అంటు పిలిచింది కమలమ్మ కోడలిని ఆ మరునటి రోజు.

"పిలిచారా, అత్తయ్యా?"

"అవునమ్మా! ఏం చేస్తున్నావూ?"

"ఇల్లు చిమ్ముతున్నా నత్తయ్యా ! వస్తున్నాను."

"ఎప్పుడూ ఏదో పని చేస్తూనే ఉంటావు నడు మెత్తకుండా."


"మన ఇంట్లో మన పని మనం చేసుకుంటే తప్పా?"

"తప్పని కా తల్లీ ! కాసేపు విశ్రాంతి తీసుకోమని. అబ్బాయి వచ్చేటప్పటికి కాస్తంత శుభ్రంగా ముఖం కడుక్కుని ఉండమని. అయినా, అన్నింటికీ నీ వొక్కత్తివే అయిపోయావు. నీ కేమన్నా అయినా కష్టం మా క్కాదూ !"

"అయినా ఇవ్వు డేం బజారు వెళ్లాలా, పేరంటాని కెళ్లాలా తయారై ఉండటానికి. వస్తున్నా నుండండి, అయిపోయింది."

కమలమ్మ యశోదను చూసి మురిసిపోయి ముచ్చట పడి ముసిముసి నవ్వు నవ్వుకుంది. కోడలి ప్రవర్తన, వినయము, విధేయత ఎంతో నచ్చాయి. ఆమెకు మొదట్లో ఓ దురభిప్రాయ ముండేది - చదువుకున్న ఆడపిల్లల మీద. ఆ కోడళ్లు అత్తల మాటలు వినరని. అందునా 'ఆ' జిల్లా వా రంటేనే ఆమెకు అ దో విధమైన భయం. అక్కడి ఆడపిల్లలు బరితెగించి ఉంటారనీ, వారు మొగుళ్లను కొంగున ముడివేసుకుంటా రనీ, అత్త






మామలను నిర్లక్ష్యం చేస్తా రనీను. కానీ, ఆమె అనుమానా లన్నీ పటాపంచలయిపోయాయి. అన్నిటికీ విరుద్ధంగా వచ్చింది ఆమె కోడలు.

"రా, యశోదా! రా, కూర్చో!"

యశోద చీర కొంగుతో విసురుకుంటూ, "ఇశ్...శ్. అబ్బబ్బ!" అంటూ అత్తగారి వక్కన కూలబడి నిట్టూర్చి చిన్నగా నవ్వింది.

"బాగా అలసిపోయావు కదూ? పోనీ సాయం చేద్దా మంటే నీ శ్రమను తగ్గిద్దా మంటే నాకు అంతటి శక్తిని దేవుడు ఇవ్వలేదు, తల్లీ!" అంది తన నిస్సహాయతకు తనే జాలిపడుతూ.

"అత్తయ్యా! ఇపుడు నే నేమన్నా అన్నానా?"

"నీ వే మనలేదు. కానీ నిన్ను చూస్తూంటే నాకే అలా అనిపిస్తోంది."

"శ్ర మేముంది ఇందులో? అయినా నే నేం కొండలు మోస్తున్నానా, బండ లెత్తుతున్నానా? అందరు ఆడపిల్ల ల్లాగే ఇంటి పని, నా ఇంటి పని చేసుకుంటున్నా నంతే!"

"ఏమోనమ్మా!" అని కోడలి మెడలోని బంగారు గొలుసును కుడి చేత్తో పట్టి చూసి, "సరే కానీ ఇలా తిరుగు. దువ్వుతాను. మంగళ వార ప్పూట ఆడవారు ఇలా నీరసపడి జుట్టు విరబోసుకుని ఉండకూడదు. చిక్కు తీసి బాగా దువ్వితే హాయిగా ఉంటుంది."

"అత్తయ్యా!" అంది ఆపుకోలేని, ఆపుకోరాని ఆనందంతో అత్తగారి వైపే చూస్తూ, ఆశ్చర్యపడుతూ.

"నేను జుట్టు దువ్వితే నీకు నచ్చదేమో కదూ?"

"ఛ! అ వేం మాట లత్తయ్యా! నాకు ఇష్టమే. ఎన్నా ళ్లయిందో అలా తల దువ్వించుకుని."

ఆ ఆనందంలో హుషా రెక్కువై చెంగున లేచి నూనె సీసా, రిబ్బను, పిన్నులు, దువ్వెన వక్క నుంచి కమలమ్మ ముందు కూర్చుని తలను వెనక్కు వాల్చింది దువ్వ మన్నట్లు. కమలమ్మ కోడలి జుట్టును పిడికిట్లో పట్టుకుని ఆ ఒత్తు జుత్తును చూసి ముచ్చట పడిపోయింది. పిడికిలి విప్పేసరికి ఆమె వీపంతా కప్పేసి నేలకు తాకుతుండిపోయాయి కురులు.

"ముడి వేసుకోరాదూ!" అంటూ ఎడమ అరచేత్తో వీపు మీద వెంట్రుకలను అదిమి పట్టుకుని, కుడి చేత్తో దువ్వెనను జుత్తులోకి పోనిచ్చి కింది దాకా దువ్వింది. ఎక్కడో చిక్కువడ్డ రెండు వెంట్రుకలు దువ్వెనకు అడ్డుపడినట్లున్నాయి. ఆమె విసురుగా దువ్వెనను లాగేటప్పటికి యశోద నడి నెత్తి మీది ఆ రెండు వెంట్రుకలూ ఊడి వస్తే తల మీద చేయి వేసి, 'ముడి వేసుకోరాదూ!' అని ఎందుకు అందా అని ఆలోచించసాగింది. క్రితం రాత్రి భర్త తనను 'ముడి వేసుకోరాదూ' అన్న మాట గుర్తుకు వచ్చింది. ఒకవేళ ... ఒకవేళ ఆ మాటలు కానీ ఆమె విన్నదో, ఏమో నని సిగ్గు పడిపోయింది యశోద.

"మా అత్తగారు న న్నలా అనేది!" అంది ఆమె.

'ఓహో! అ దన్నమాట. అంతే కదా! ఇం కేమేమో అనుకున్నాను' అనుకుంది మనసులో యశోద.

"అయినా అప్పటి ముడులే వేరు! వాటిని వేసుకునే వారే లేరు. ఈ కాలంలో అందరికీ వాలు జడలే. పదహారేళ్ల పడుచుకైనా, అరవయ్యేళ్ల ముసలిదానికైనా!"

యశోద రెండు చేతులతో మోకాళ్లను పట్టుకుని, దువ్వెన నడినెత్తి మీదికి వచ్చినప్పుడు తలను కొద్దిగా ముందుకు వంచి, దువ్వెన వీపు మీదికి వచ్చేటప్పటికి మళ్లీ వెనక్కు తీసుకుంటూ ఆమె మాటలు వింటూండిపోయింది.

"ఇప్పట్లా బన్నులూ, విగ్గులూ ఉండేవా ఏమిటి?"

అబ్బో! ఏమో ననుకున్నాను - అత్తగారికి పరిశీలనా శక్తి బాగానే ఉంది - అనుకుంది యశోద.

"ఊడిపోయిన వెంట్రుకల్ని భద్రంగా దాచి, ఉండగా చుట్టి ..." కమలమ్మ కోడలి జుత్తుని రెండు పాయలుగా చేసి ఒక భాగాన్ని పురివిప్పి ఆ పురి విడిపోకుండా కోడలి చేతికి అందించింది పట్టుకోమని. "ఆ ఉండను పిన్నులతో గుచ్చి దాని చుట్టూరా నిజమైన వెంట్రుకల్ని పురి విప్పి చుట్టుకునేవాళ్లం."

"ఆ ముడి మీరూ వేసుకునేవారా?" ఆశ్చర్యంగా చూసింది యశోద.

"మరీ చోద్యంగా మాట్లాడుతావే నీవు! ఏ ముం దందులో?" ఎంత 'సింపులో' అన్నట్లు తేల్చి పారేసింది కమలమ్మ.

ఇలా మెలితిప్పి, అలా మెలితిప్పి ఎలాగైతే నేం ఓ అయిదు నిముషాల్లో ఏదో ముడి వేసి, వక్కనే ఉంచిన పది పన్నెండు పిన్నులను అటూ ఇటూ గుచ్చి, "ఇంతే! చూసుకో పో - అద్దంలో ముడి ఎలా ఉందో, ఏమిటో!" అం దామె.

"మీ కెలా ఉంది?"

"బాగుంది." అంది - తృప్తిగా, ప్రేమగా, అభిమానంగా, ఆప్యాయంగా కోడలినే చూస్తూ కమలమ్మ.

"చాలు. మీరు బాగుం దన్నారు చాలు. ముడు లెప్పుడూ ఎదుటి వారి కోసమే. ప్రత్యేకంగా వెళ్లి బాగుందా, లేదా అని చూడక్కరలేదు."

"కాదులే .." అం దామె ముసిముసిగా నవ్వి.

"అంటే?" అంది యశోద అత్తగారిని చూసి.

"అంటేనా .. అదీ ... అ దంతే!" అందామె నెమ్మదిగా లేస్తూ. "చూడు యశోదా! అబ్బాయి వచ్చేటప్పటికి ఆ పాత చీర కట్టుకుని అలా జిడ్డోడుతున్న మొహంతో ఎదురు వెళ్లకు. కాస్త మొహం కడుక్కో. సిగలో పూలు చుట్టుకో! వేడి వేడిగా కాఫీ కాచి ఉంచు - రాగానే ఇచ్చేందుకు వీలుగా."

"ఇస్తాను. అంతేనా, ఇం కేమైనా చేయాలా ఆ తరువాత?" అంది కొంగు కొనలను నోటి కడ్డం పెట్టుకుని వస్తున్న నవ్వు నాపుకుంటూ.

"ఆ తరువాత చేయాల్సిం దేమైనా ఉంటే, అది అబ్బాయి చెపుతాడు."

ఆ 'అది' ఏమిటో అంత వయసు వచ్చిన ఆవిడ చెప్పదు. ఇంత వయసున్న ఈవిడా అడగదు. అ దంతే! ఎవరూ ఎవరికీ చెప్పక్కరలేదు. ఎవరికి వాళ్లే తెలుసుకుంటారు. వారికి వాళ్ల వయసే చెబుతుంది. వాళ్లనుభవం చెపుతుంది. వాళ్ల పరిసరాలు తెలుపుతా యి. అదీ,



## అరికాలి మంట

*"ఒరేయ్! దగ్గరకు రాకురా! నిన్ను చూడగానే అరికాలి మంట నెత్తి కెక్కింది" కోపంగా అన్నాడు భీమేశం.*

*"ఓహో! అదన్నమాట సంగతి. ఇందాకట్నించి వెంట్రుకలు కాలిన వాసన వస్తుంటే, ఏదో అనుకున్నా కానీ, ఇదీ సంగతని ఇప్పుడు తేలింది సుమా!" ఉడికించాడు రామేశం.*

ఎన్. జి. శేషాద్రి [పావగడ]

ఇదీ కాక హృదయం లోనుంచి వా టంతట అవే ఊహల్లా పైకి ఉబికి వచ్చి తెలిసిపోతాయి. అది ప్రకృతి సహజమైనది.

యశోదకు భర్త దగ్గర అనాటి వరకు దొరికిన ఆనందం వేరు. ప్రత్యేకంగా ఈనాడు లభించిన ఆనందం వేరు. స్వల్పమైన శారీరక, బాహిరమైన అలంకారాలతో, మార్పులతో ఎదుటి వారి అంతరంగాలను ఇంతగా ఆకట్టుకుని, ఆకర్షించుకుని, నవ్యోత్సాహాన్ని పొందవచ్చునని యశోద ఎరుగదు. ముడి పదార్థాలలో ముడిపడి ఉన్న ప్రేముడి ఇంత ఉత్కృష్టంగా ఉంటుం దని ఆశ్చర్యపోయి ఆ ఆనందోత్సాహాలకు పరోక్ష కారణభూతురాలైన అత్తగారికి మనసు నిండా అభినందనలు తెలుపుకుంది.

** ** **

"మిమ్మల్ని మాత్రం నే నెలా బలవంతం చేస్తా నండీ?" అంది కమలమ్మ భర్త రఘురామంతో ఆ రాత్రి.

"బలవంత మేముం దిందులో? ఆశలను, ఆశయాలను ..."

"మన ఆశ లయినా, ఆశయా లయినా ఉత్తుత్తివే. ఏమైనా తీరగలిగేవా? చేరగలిగేవా?"

"అంటే, అంటే ? ఏమిటిటా? ఆఁ ఏమిటాని? నీ కోరిక నేను తీర్చలే ననా నీ భావం?"

"సర్లెండి. మాట వరస కేదో అన్నా నని దాన్ని పట్టుకుని సాగదీస్తున్నారు."

"లేదు. ఇప్పుడే వెళ్లి అబ్బాయిని అడుగుతాను."

"ఏ మని? ఏమని అడుగు తారు?"

"ఓ ఆరువందలు కావాలిరా అని. ఏం, ఇవ్వడా?"

"ఎందు కివ్వడూ? ఎందుకూ అని అడగకుండా ఇస్తాడు."


"ఆగిపోయా వేం?"

"వాడు అంత డబ్బు ఇస్తున్నప్పుడు కోడలు పిల్లకు తెలియకుండా ఎలా ఇవ్వగలుగుతాడు? దాచి ఇవ్వాలి. ఈ డబ్బు విషయంలో దాపరికం ఉండటం కూడా ఆలూ మగల మధ్య అంత మంచిది కాదు. పోనీ చెబితే, ఆ అమ్మాయి ఏ మనుకుంటుందో, ఏమో?"

"ఆ అమ్మాయి అలా అనుకునే దానిలా లేదు. పోనీ, ఎప్పుడన్నా అలా అన్నదా? అనుమానం సోకిందా?"

"లేదండీ, ఆ అమ్మాయి విషయంలో మీ అంచనా సరైనదే. నాకూ అలాగే అనిపిస్తోంది. కానీ ఎంతైనా వయసులో ఉన్నవాళ్లు, ఉత్సాహంగా తిరగవలసిన వాళ్లూ వాళ్లు. నా క్కావలసిన చీర వెలలో, సగం వెల పెట్టి ఆ పిల్లకే ఓ చీర కొంటే వాళ్లిద్దరూ ఎంత ఆనందపడతారూ? వాళ్ల కళ్లల్లో ఎంత ఉత్సాహం? వాళ్ల మొహాల్లో ఎంత వెలుగు? ఎంత తృప్తి! అవి చాలవుటండీ మనకు? ఆ కొనబోయే పట్టు చీర కట్టుకున్నా కట్టుకోకపోయినా నాకు రాబోయే కొత్త అందాలు లేవు, పోబోయే ఉత్సాహాలు అంతకన్నా లేవు. ఏమంటారు?" ఆ మాట లంటున్నప్పుడు ఆమె మొహంలో ఏదో తెలియని పవిత్రత గోచరించింది.

"చూడు ! ఉత్సాహా లనేవి కేవలం శారీకమైనవే



అనుకోకూడదు. అంత మాత్రంతో కొడుకూ, కోడళ్లలా మనం పడ గ్గదిలో ఆనందం అనుభవించకున్నా ..."

"అబ్బబ్బ! ఊరుకోండి! వాళ్లు నిద్దరపోయినట్లు లేదు. మన మాటలు వినగలరు.

"ఇంతకీ ఆ చీర సంగ తేం చేశావు?"

"ఇంకా ఏ చీరండీ! ఇంత చెప్పాక ..."

"అలాగే లెం డమ్మమ్మ గారూ!"

"సర్లెండి, తాతయ్య గారూ!"

** ** **

"మనం ఇవాళ షాపింగ్‌కి వెడుతున్నాం సాయంకాలం." యశోద భర్త మెడకు ఉన్న నెక్ టై ముడిని కుడిచేత్తో సవరిస్తూ అంది. ఎడమ చేత్తో టై కొసలను సుతారంగా లాగుతూ నవ్వింది.

"ఓ.కే! అ యాం రెడీ! అయిదింటి కల్లా నీ ముందుంటా - చాలా!"

"అలాగే నా కో ఆరు వందలు కావాలి."

"కేష్, ఆర్ చెక్?"

"నగదు" అంది కర్చీఫ్ మడతల మధ్య



మేత

*పల్లెటూరి రైతు: "అయ్యా! నా గేదె మేత తినడం లేదు. పాలు ఇవ్వడం లేదు!"*

*పశువుల డాక్టర్: "ఆ గేదెని ఎక్కడ కొన్నావేయ్?"*

*రైతు: "హైదరాబాదులో."*

*డాక్టర్: "దానికి నా వైద్యంతో పని లేదు! పోయి సినిమా పోస్టర్లు, చెత్త కాగితాలు బాగా తినిపించు!!"*

యు. చిట్టిబాబు [కొత్తగూడెం]

పొడరును చల్లి అందిస్తూ.

"డన్! తెస్తా!"

"అవునూ, ఇంత డబ్బు ఎందుకని అడగరే? నే నేం చేస్తానో, ఎందుకు ఖర్చు పెడతానో. నే నేమన్నా వృథా ఖర్చు చేస్తే."

"నీకు మాత్రం తెలియదూ? నీవు చేయవని నమ్మకం!"

"అత్తయ్య కో చీర కొందామని."

"అలాగే నే నిన్ను అడిగానా? నాకు చెప్పనక్కర్లేదు."

సాయంకాలం అనుకున్నట్లుగా భర్త రాకపోయేసరికి యశోధకు కోపం వచ్చింది. పోనీ అంటే, డబ్బు కూడా లేదు. అయినా ఇం కో అరగంట చూసింది ఆశగా. అప్పటికి భర్త రాకపోయేసరికి ఆఫీసులోనే ఏదో ఆలస్యమైం దని అర్థం చేసుకుని గబగబా తయారై, అత్తయ్య గారితో చెప్పి వెళ్లిపోవాలని నిశ్చయించుకుంది బజారుకు అనుకున్నది తీసుకు రావటానికి.

"అత్తయ్యా!" అం దాశ్చర్యంగా యశోద. ఎక్కడికో బయటకు బయలుదేరా లని సిద్ధంగా ఉన్నారు వా ళ్లిద్దరూ.

"శుభం! అమ్మాయి ఎదురు వచ్చింది. మంచి శకునం."

"చూడమ్మా యశోదా! మీ మామయ్యగారి స్నేహితునింటికి వెళ్లి వస్తా మమ్మా!"

"అలాగే!"

"ఎంతా? ఓ గంటా గంటన్నరలో వచేస్తాం" అన్నా రాయన.

"అలాగే మామయ్యా!"

"వె ళ్లి వస్తా మమ్మా! " యశోదను తప్పించుకుని రెండడుగులు ముందుకు వేసింది కమలమ్మ.

"అత్తయ్యా!" అంది యశోద ఏదో చెప్పాలని.

"ఏమ్మా?"

"ఏం లే దత్తయ్యా! బయటకు వెడుతున్నారు. మీ అబ్బాయా లేరు. క్షమించండి, మామయ్యగారూ! చేతిలో డబ్బుందో, లేదో! పోనీ

నేను, మీ రేమనుకోకపోతే నే నివ్వనా?"

"అక్కర్లేదులే, తల్లీ!" అన్నారు తృప్తిగా యశోదనే చూస్తూ కమలమ్మ, ఆమె భర్తానూ.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయాక - ఓ అరగంట తరువాత యశోద కూడా తలుపు తాళం పెట్టి బజారుకు వెళ్ళిపోయింది. ఎవరైనా చూస్తా రేమో నని తలనిండా కొంగు కప్పుకుని ఓ షాపులోకి బెదురు బెదురుగా వెళ్ళబోతున్న యశోదకి అప్పుడే షాపులో నుంచి బయటకు వెళ్ళబోతూ గొడుగును అడ్డం పెట్టుకుని వెళ్తున్న ఓ ముసలి జంట కనిపించింది. యశోదకు అప్పుడే అనుమానం వేసింది. వాళ్లు అత్తయ్యా, మామయ్యలు కాదు కదా అని. ఆ షాపు బంగారు, వెండి వస్తువులను తాకట్టు పెట్టుకుని కానీ, కొనుగోలు చేసి కానీ డబ్బిచ్చే షాపు.

"ఇందాక బయటకు వెళ్ళిపోయిన ఆ ముసలాళ్లు ..." అనుమానంగా అడిగింది యశోదషాపులో కూర్చున్న సేఠ్‌ను.

"ఆఁ, ఆఁ చిన్న బంగారు వస్తువు అమ్మారమ్మా! రెండు వందలు తీసుకుని వెళ్లారు."

'రెండొందలా!' మనసులో అనుకుంది యశోద. రెండు వంద లేం చాల్తా యనా? చాలవే! అత్తగారు మనసుపడ్డ ఆ చీర ఆరువందలు. ఈ డబ్బు అందుకోసం కాదా? ఇంకెందుకో ఆ ఇంకో వనేది? డబ్బులు కావాలా అని అడిగితే వద్దన్నారే'.



## పవిత్ర దేవాలయం

*"అదేం టమ్మాయ్!" అలా ప్రదక్షిణాలు చేస్తున్నా వేమిటి? ఇది బడి" అన్నాడు హెడ్‌మాస్టారు ఏనాదయ్య.*

*"బడి అంటే పవిత్ర దేవాలయం అన్నారు గదండి" చెప్పింది ఆ రోజే టీచర్‌గా చేరిన సరోజిని.*

గీత [గుంటూరు]

"ఏడు వందలు వస్తుం దమ్మా!" అన్నాడు సేఠ్ యశోద ఇచ్చిన బంగారు వస్తువును తూకం వేసి లెక్కలు కట్టి, వస్తువును ఆమె ముందుకు నెట్టి.

"ఇవ్వండి" అం దాలోచిస్తూనే యశోద.

"పసు పృచ్చ పట్టు చీర కావాలండీ - ఎనిమిది గజాలది!" అంది చీరల షాపులోకి నడిచి.

"ఎనిమిది గజాల్లో లే వమ్మా! ఆరు గజాలలో ఉన్నాయి."

"లేవా? గంట క్రితం వచ్చి అడిగి వెళ్లానండీ, అప్పుడు ఉం దన్నారు?" అవకాశం పోయిందే నన్న బాధతో అంది.

"నిజమే నమ్మా! ఉండింది. కానీ ఎవరో వచ్చి ఇప్పుడే తీసుకు వెళ్లారు. ఆ రంగు, ఆ బార్డరు కావాలని."


"తీసుకు వెళ్లారా?" అంది నిరాశగా. అయ్యో, ఎంత పని జరిగిపోయింది - అనుకుంది కూడా.


"అవునమ్మా! పది నిముషాల కింద వచ్చి ఉంటే ఇచ్చుండేవాడిని. ఆయ నెవరో అదే కావాలని పట్టుబట్టి మరీ తీసుకువెళ్లారు."

అత్తయ్యా! నా శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరైయిపోయిం దత్తయ్యా! మీకు మీరు మనసు పడిన చీర కొనివ్వా లని మీకు సంతోషం కలిగించాలని ఎంత శ్రమపడ్డాను? నా శ్రమ వృథా అయిపోయిం దనుకుని ఎంతగానో బాధపడిపోయింది యశోద.

ఇంటికి ఎలా వచ్చిందో, తలుపు ఎలా తీసిందో, లోపల కెలా వచ్చిందో యశోదకు తెలియనే తెలియదు. ఆమె కేదో నీరసం వచ్చినట్లయింది. ఆమెలో ఏదో నిరుత్సాహం, ఏదో సాధిద్దా మన్నది సాధించలేకపోయానే అనే బాధ. ఓడిపోతున్నా నన్న వేదన. తలను పట్టుకుని శూన్యంలోకి చూస్తూండిపోయింది. ఏం చేయటానికీ తోచని అయోమయ స్థితిలో ఉండిపోయింది. అరగంటసేపు ఆలోచించగా, ఆలోచించగా చటుక్కున ఆమెకు తోచింది. తను చేయవలసిన కర్తవ్య మేదో? వెంటనే లేచి తిరిగి ఇంటికి తాళం వేసి బజారుకు బయలుదేరింది.

చేయవలసిన కార్యం చేసుకుని వచ్చాక ఆమెకు ఇప్పుడు మనసు తృప్తిగా, హాయిగా,






ఆనందంగా ఉంది. అంతక్రితం అలసట, నీరసం, నిరాశ, నిరుత్సాహం ఇప్పుడు లేవు. ఏదో కొత్త ఉత్సాహం వచ్చినట్లుంది.

"యశోదమ్మా!" అంటూ మామ గారు సంతోషంగా, ఆప్యాయంగా పిలుస్తూ ఇంచుమించు ఆమె వెనుక వెనుకే తిరిగారు ఆ సాయంత్రం. ఆయనలోనూ ఏదో నవ్యోత్సాహం!

"చూడమ్మా యశోదా!" అంటూ మురిపంగా చూస్తూ, వద్దంటున్నా వినకుండా తను చేయగలిగిన సహాయం చేస్తూ, ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెబుతూ సరదాగా ఉండిపోయిం దామె అత్తగారు. ఆమెలో కూడా ఏదో తెలియని కొత్త సంబరం.

"అమ్మా! నాన్నా! యశూ!" అంటూ భర్త కూడా వంటింటి చుట్టుపక్కలే తిరుగుతూ ఏదో మాట కలిపి ప్రతి ఒక్కరినీ పిలుస్తున్నాడు.

"అత్తయ్యా! మీ రూరుకోండి! అయ్యయ్యో! ఏమిటి మామయ్యా మీరు ... మీ రాగండి!" అంటూ ముగ్గురినీ వారు చూపుతున్న అనురాగానికి ఒకవైపు మురిసిపోతూనే, మనసులో తాను వెలగబెట్టిన మంచి కార్యానికి తనే సంబరపడిపోసాగింది యశోద.

"అవునే, అమ్మాయ్ యశోదా! ఆ చేతు లేమిటి బోసిగా ఉన్నాయి? ఆ చేతి గాజు ఏమైందీ?" అంది కమలమ్మ.

అలా అడిగేటప్పటికి యశోద తడబడిపోయింది. పట్టుబడిపోయినట్లుగా తొట్రుపాటు పడింది. కానీ వెంటనే కప్పిపుచ్చుకుంటూ, "అదా! అదీ ..... ఇందాక బయటకు వెళ్తూ వాచీ పెట్టుకున్నా నత్తయ్యా! వాచీ తీసి గాజు వేసుకోవడం మరిచిపోయాన్లు" అని, "అది సరే గానీ, మీ మెళ్లోని పుస్తెల తాడులో, ఆ కోపులు, పూసలు కనిపించవే?" అంది ఆశ్చర్యం ప్రకటిస్తూ.

"ఆc, అవునమ్మా! తీసుంచాను."

"అత్తయ్యా!" అం దదోలా యశోద.

"అవునే, నిజమే! అ దేవి టలా చూస్తావూ?"

"నా మొహం చూసి చెప్పండి. అది ... అది నిజం కాదు. నాకు తెలును కానీ, ఎందుకు చేశా రత్తయ్యా?"

"ఏమిటి, యశోదా?" అల్లంత దూరంలో వా ళ్లిద్దరి సంభాషణనూ కొంచెం కొంచెం విన్న యశోద భర్త అడగనే అడిగాడు.

"ఏం లేదు లేరా! ఏదో మా ఆడవారి సంగతిలే!" అంటూ మాట మార్చేసి, తల్లి కొడుకుని దగ్గరకు రాకుండా చేసింది.

పరిస్థితిని అర్థం చేసుకుని, అత్తగారిని మరీ ఇరుకున పెట్టకుండా యశోద మౌనం పాటించింది అంతటితో - ఆరా తీయకుండా.

"అమ్మాయ్, యశోదా! ఇలా రామ్మా!"

అందరూ ముందు గదిలో కూర్చుని టీ.వీ. చూస్తున్నారు. సరదాగా మాట్లాడుకుంటున్నారు మధ్య మధ్య. చను వున్నా యశోద ఎప్పుడూ అత్త మామల సరసన కూర్చోదు. అప్పుడు పిలిచింది యశోదను దగ్గరకు రమ్మని.

"ఏమి టత్తయ్యా!"

"రా, ఇలా రా! ఇంద - ఈ చీర కట్టుకుని రా! నిన్ను చూడాలి ఈ చీరలో. ఇది మీ అత్త మామల దగ్గర నుంచి లభించిన బహుమతి. చిన్న బహుమతి, తల్లీ!"

అయితే ఇదన్న మాట! ఇందుకన్నమాట వీళ్లు అంత త్యాగం చేసింది - అనుకుంది యశోద. వా ళ్లందించిన పాకెట్‌ను తీసుకుని ఆ దంపతులకు పాదాభివందనం చేయబోయింది.

"ఆc, ఆ, చీర కట్టుకుని రా పో! ఆనక దండం పెట్టుకుందువు గానీ."

అత్త మామలకు తనపై ఉన్న అనురాగానికి ఎంతైనా మురిసిపోయింది. ఉబ్బి తబ్బిబ్బయిపోయింది. ఆమె ఆనందాన్ని చూసి ఆ ముసలి దంపతులు ఎంతో ముచ్చటపడిపోయారు.

"అమ్మా! ఇప్పుడు నీ విలా రా!" అన్నాడు సూర్యం.

"ఏమిటిరా, ఎందుకు?"

"రా, ఇలా రా చెబుతా!" అని నవ్వి, "యశూ! ఈ చీరను అమ్మకు కుంకుమ పెట్టి ఇవ్వు" అన్నాడు.

యశోదకు అప్పుడు అర్థమైపోయింది - 'ఆ చీరనే కావాలని తీసుకెళ్లిపోయా రెవరో' అని షాపు వాడు చెప్పింది ఈయన గురించే నన్నమాట! భర్త తనను ఆశ్చర్యపరచా లనుకున్నారన్నమాట - అనుకుంది యశోద.

"ఇవ్వు దెందుకురా ఇవీ?"

"ఎందు కేమిటీ? అయినా నే న్నీకు చీర ఇవ్వటానికి సమయం, సందర్భం కావా లేమిటి?"

ఆ ముసలి తల్లి హృదయం ఆనందంతో పరవళ్లు తొక్కింది. ఆమె కళ్లు అశ్రుపూరిత లయ్యాయి. అందులోనూ ఆ చీ ... ఏ చీరయితే కావా లనుకుని తాను మురిసిపోయిందో, అదే చీర! ఆ చీరని గుండెకు ప్రియమార హత్తుకుని ఏదో తీపి అనుభూతిని పొందుతూ లేవబోయింది కమలమ్మ.

"ఒక్క నిముషం ..." అంది యశోద.

"ఇం కేమిటమ్మా?"

"ఏమీ లేదు" అంటూ అత్త గారి కాళ్లకు పసుపు పులుముతున్నట్లు ఒంగి, "అత్తయ్యా! ఈ పొట్లం తీసుకోండి. ఇందులో మీరు అమ్మేసిన పుస్తెల తా డు కున్న పూసలూ, కోపులూ ఉన్నాయి. నేనే విడిపించి తెచ్చాను. మీ అబ్బాయికి తెలిస్తే బాగుండదు" అంది రహస్యంగా యశోద.

"నా తల్లీ, యశోదా!" అంటూ కోడలిని అక్కున చేర్చుకుంది కమలమ్మ.

అత్తా కోడళ్ల అన్యోన్యతను చూసి రఘురాం భుజం మీ దున్న కండువాతో ఆనంద బాష్పాలను ఒత్తుకుంటే, పక్కకు తిరిగి కర్చీఫ్‌తో కళ్ల నద్దుకున్నాడు వాసు.

తండ్రీ కొడుకు లిద్దరూ ఒక్కటే అనుకున్నారు. కాదు మనసుల్లో దేవుడికి దండం పెట్టుకుని కోరుకున్నారు -

"భగవాన్! ఈ అనుభూతిని మా కెప్పుడూ కరువు చేయకు, ప్రభూ!" అని

★



మార్పు

*మీనాక్షి:* అదేమి టొదినా, మీవారు ఇన్నాళ్లు రాత్రిళ్లు చాలా పొద్దు పోయింతర్వాత వచ్చేవారుగా. మూ ్రోజుల నుండి చీకటి పడకుండానే గూడు చేరుకుంటున్నారే! ఇంతలో అంత మార్పెలా వచ్చింది?

*కామాక్షి:* ఆ! ఏముంది. మావారు ఇల్లు చేరిన అరగంట తర్వాత నేను చేరడం ప్రారంభించా, అంతే!"

ఎన్. జి. శేషాద్రి [పావగడ]